ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 17-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విజయాల దిశగా మార్గాలను సుగమం చేస్తూ.. వ్యక్తుల జీవితాల్లో అవకాశాలను సృష్టించే కీలకమైన సాధనం విద్య అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- ❖ ఆరోగ్య బీమాను 2033 నాటికి అందరికీ కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

- ❖ వికసిత్ భారత్-2047 దార్శనికతను సాకారం చేయడంలో ఆహార శుద్ధి రంగం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు.

- ❖ పశ్చిమాసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక పరిస్థితి బలంగానే ఉందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.

==============================

విజయాల దిశగా మార్గాలను సుగమం చేస్తూ... వ్యక్తుల జీవితాల్లో అవకాశాలను సృష్టించే కీలకమైన సాధనం విద్య అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ... సాధికారత సామర్థ్య పెంపుదల ప్రక్రియ పాఠశాల విద్య నుండే రూపుదిద్దుకోవడం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందించడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం `పీఎం పోషణ్ శక్తి నిర్మాణ్` రూపంలో ప్రపంచంలోనే అతిపెద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఆరోగ్యకరమైన, బలమైన దేశ నిర్మాణానికి, ప్రాథమిక విద్యలో పోషకాహార లోపాలను పరిష్కరించడానికి ఈ పథకం ఒక ముఖ్యమైన ముందడుగు అని కొనియాడారు. దేశంలోని పిల్లల్లో ప్రారంభ విద్యకు ఆటంకంగా మారుతున్న పోషకాహార సమస్యను ఇది పరిష్కరిస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్-2047 దార్శనికతను సాకారం చేయడంలో ఆహార శుద్ధి రంగం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన న్యూట్రి భారత్ -2026 కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ… వినియోగదారులకు అందించే అన్ని ఆహార పదార్థాల నాణ్యతను విక్రయదారులు తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని, ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఆహార శుద్ధి రంగానికి ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. పరిశ్రమలు, విధాన రూపకర్తలకు మధ్య వారధిగా పని చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఆవిష్కరణలు, పెరుగుతున్న ఆరోగ్య అవగాహన కారణంగా న్యూట్రాస్యూటికల్, ఫంక్షనల్ ఫుడ్ రంగం స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు, భద్రత, నియంత్రణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడానికి సమిష్టి కృషి అవసరమని చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ ఆసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక పరిస్థితి బలంగానే ఉందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ… భారతదేశంతో తమ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉత్సాహం పెరుగుతోందని తెలిపారు. గత మూడేళ్లలో 38 దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని, ఇవి ఎగుమతిదారులకు అవకాశాలను కల్పించాయని ఆయన అన్నారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నీ అమలులోకి వచ్చినప్పుడు, అవి భారతీయ ఎగుమతిదారులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. గత నెల ఫిబ్రవరి వరకు భారతదేశ వస్తువుల ఎగుమతులు స్థిరంగా ఉన్నాయని, మార్చి మొదటి వారం ఎగుమతుల్లో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ.. రెండవ వారంలో అది సానుకూలంగా మారిందని మంత్రి తెలిపారు. ఈ నెలాఖరు నాటికి భారతదేశం తన ఎగుమతుల స్థాయిలను నిలబెట్టుకోగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో భారతదేశానికి ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని పీయూష్ గోయల్ పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వం, సుస్థిర వృద్ధికి బలమైన హరిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడం ఎంతో అవసరమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 10వ సుస్థిర వ్యాపార భవిష్యత్ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. హరిత మౌలిక సదుపాయాల వైపు దేశం పరివర్తన చెందాలని, ఇంధన ఆధారిత ఆవిష్కరణల ద్వారా నడవాలని పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధనం, సుస్థిర పట్టణ ప్రణాళిక, స్మార్ట్ వనరుల నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు దేశ మౌలిక సదుపాయాలను మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం తన ఆర్థిక నిర్మాణంలో ఒక పెద్ద నమూనా మార్పును చూస్తోందని, సంప్రదాయ తయారీ రంగాన్ని దాటి పునరుత్పత్తి, సుస్థిర ప్రక్రియల వైపు పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. పోటీతత్వంతో పాటు… ప్రస్తుత కాలానికి అనుగుణంగా భారతదేశం ప్రపంచ వ్యూహాలు, ప్రాధాన్యతలు, ప్రమాణాలను అనుసరిస్తుందని జితేంద్ర సింగ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్య బీమాను 2033 నాటికి అందరికీ కల్పించే దిశగా కృషి చేస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాజ్యసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ… దేశవ్యాప్తంగా 25 వేల గ్రామ పంచాయతీలను ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఒక బృహత్తర గ్రామీణ విస్తరణ ప్రణాళికను

చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్య బీమాను ప్రభుత్వం ఒక ప్రాధాన్యతా రంగంగా పరిగణిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో దీనిని విస్తరించడానికి పలు విధానపరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆరోగ్య బీమా రంగం మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, 2024-25లో ఈ రంగం లక్షా 17 వేల 505 కోట్ల రూపాయలను నమోదు చేసిందని, వివిధ బీమా పథకాల కింద 58 కోట్ల మందికి బీమా కల్పించబడిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ బీమా సంస్థలతో పాటు ప్రభుత్వ-మద్దతుగల బీమా కంపెనీలు కూడా వాటి విస్తరణకు దోహదపడుతున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ముఖ్యంగా పేద, బలహీన వర్గాల వారికి ప్రీమియం రేట్లను అందుబాటులో ఉంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ తపాలా శాఖ వినియోగదారుల కోసం కేంద్రం కొత్త సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్యారంటీడ్ నెక్స్ట్ డే డెలివరీ సేవలను కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ న్యూ ఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ విప్లవాత్మకమైన మార్పుతో ఇకపై ఉత్తరాలు, పత్రాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... మొదటి దశలో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ సహా 6 నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... త్వరలో ఎస్ఎంఎస్ ట్రాకింగ్, ఓటీపీ డెలివరీ, జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయబోతున్నామన్నారు. 97 నుంచి 98 శాతం డెలివరీలు.. 24 నుండి 48 గంటల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =